# అనూహ్యం

తెల్లనివన్నీ పాలు, నల్లనివన్ని నీళ్లు అని అందరూ అనుకుంటారో లేదో నాకు తెలియదు. నేను మాత్రం ఆ భ్రమలో చాలాకాలం ఉన్నాను.

సావిత్రి చేసింది తప్పు అని నేను అనుకొన్నాను. అయితే రంగారావుని సమర్థిస్తున్నట్లుగా కాదు. వాళ్ళ మధ్య తండ్రీ కూతుళ్ళ అనుబంధం ఉంది. అది నాకూతురే కాదు. నాగుమ్మంలో కాలుపెడితే నరికిపారేస్తాననడం ఒక తండ్రిగా అతను అనవలసిన మాట కాదు.

"జ్యోతిర్మయి అక్కయ్య దగ్గర నుండి ఫోను" అంది పక్కింటివారి అమ్మాయి.

మా జ్యోతి ఫోను చేసిందంటే గాబరాపడ్డాను. సాధారణంగా అది ఇన్‌లాండ్ లెటర్లో ఆ చివరనుండి ఈ చివర వరకు మంచి ముత్యాల్లాంటి అక్షరాల్తో ఉత్తరాలే రాస్తుంది. 'ఫోనులో ఇన్ని కబుర్లు చెప్పగలమా? పైగా డబ్బు దండగ' అంటుంది. మా ఇంటిలో స్వంతఫోను లేకపోవటం కూడా ఒక కారణమే.

ఉన్నపాటున బయలుదేరబోయాను. 'షర్ట్ వేసుకొండి అని నాభార్య చెప్పకపోతే అలాగే వెళ్లిఉండేవాడిని. ఆ సమయంలో పిల్లదగ్గర నుండి ఫోనువస్తే అంత గాబరా వేసింది.

వాళ్లింట్లో పది నిమిషాలు కూర్చున్న తరువాత ఫోను రింగ్ అయ్యింది. మీకే అన్నట్లు ఆ పిల్ల నావంక చూసింది. ఫోన్ నేను ఎత్తాను.

"ఎవరు? నాన్నగారా? నేను జ్యోతిని" అంది.

...........

"సావిత్రి లేచిపోయిందట వివరాలు మీకేమైనా తెలుసా?"

ఉన్న ఊర్లో సంఘటన అయినా నాకు తెలియదు. కానీ ఎక్కడో దూరంగా ఉన్న జ్యోతికెలా తెలిసింది?

"నాకా విషయాలు తెలియవు" అన్నాను.

"అలాగా! మీకేమైనా తెలిసిందేమోనని భోగట్టా చేసాను" అంది జ్యోతి. తన కాపురం విషయాలైనా చెప్పకుండా పెట్టేసింది.

అది అలా ఫోన్ పెట్టేసినా నా మనసు కుదుటపడలేదు. కొత్తగా పెళ్ళై అత్తవారింట్లో ఉంటున్న

ఒక్కగానొక్క పిల్ల ఫోన్ చేస్తే ఏం కొంపమునిగిందో అనుకోవటం సహజమే. అయితే మా పిల్ల బుద్ధిమంతురాలు. ఎవరితో ఎలా మెలగాలో తెలుసు. అందరికి నోట్లో నాలుకలా ఉంటుంది. అంతలోనే సావిత్రి లేచిపోయిందన్న విషయంతో మనసు గిలగిలలాడింది. సావిత్రి కూడా మా అమ్మాయిలాగే సౌమ్యురాలు. సావిత్రి, మా అమ్మాయి కలిసి రెండేళ్ళు ఒకే జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ రోజుల్లో సావిత్రి మా ఇంటికి వచ్చేది. నన్ను బాబాయ్ అని, నా భార్యను పిన్ని అని సంబోధించేది. అదీ మా మధ్యనున్న బాదరాయణ సంబంధం.

"మంచిపని చేసింది" అంది నా భార్య విషయం నా నోటవిని.

ఎవరితో లేచిపోయింది? ఎందుకులేచిపోయింది? అలా ఓ అమ్మాయి ఎవరితోనో లేచి పోవటం సభ్యసమాజం ఆమోదించే విషయం కాదే. చివరకు జ్యోతిర్మయికి కూడా మింగుడుపడకే కదా నాకు ఫోన్‌చేసింది. తన స్నేహితురాలు ఇలాంటి పాడుపని చేసిందంటే దానికెంత బాధగాఉందో?

నా భార్య అలా అంటే ఆమెమీద నాకు కోపం వచ్చింది. 'లేచిపోవటం - మంచిపనా?' ఆ లేచిపోయినది పరాయిపిల్ల కాబట్టి ఆ మాట అనగలిగింది. ఆవిషయాన్ని ఇంకా సాగదీసి లాభంలేదు. పాపం రంగారావు ఎంత కుమిలిపోతున్నాడో?

★ ★ ★

ఒక్కొక్క విషయాన్ని మరిచిపోవాలనుకుంటాం. గోడకు వేసి కొట్టినబంతి తిరిగి మన దగ్గరకు ఎలా వస్తుందో ఆ ఆలోచనలు అలాగే మన మదిలోనికి తిరిగి వస్తూ వుంటాయి.

"సావిత్రి అందంగా ఉంటుంది. మంచి చదువుంది. తెలివి గల పిల్ల. బ్యాంక్ ప్రొబేషన్ ఆఫీసర్ల పరీక్షలో నెగ్గి జాతీయబ్యాంకులో జూనియర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నది" అంది వంటింటిలోంచి నా భార్య. నేనేకాదు నా భార్య కూడా సావిత్రి గురించి ఆలోచిస్తున్నదని అర్థమైంది.

"అన్నీ వున్నా ఆ పిల్లకు పెళ్ళికాలేదు" అంది.

"కొందరికి పెళ్ళిళ్లు ఆలస్యంగా జరుగుతాయి. సావిత్రి తొందరపడింది. ఓ ఆడపిల్ల ఎవరితోనో లేచిపోవటం హర్షించదగ్గవిషయంకాదు" అన్నాను. ఆడపిల్లకు పెళ్ళి చేయటం ఒక యజ్ఞంతో సమానమని మా అమ్మాయి వివాహమే నిరూపించింది. ఇంటరు కాగానేపిల్లకు పెళ్ళి చేయాలనే మేం అనుకోకుండా ఉంటే మా జ్యోతి సావిత్రిలా బి.ఎస్.సి.చేసి ఉండేది. అటు చదువుకొనసాగలేదు. ఇటు పెళ్లికాలేదు. దాని పెళ్ళికోసం మేం పడినపాట్లు ఆ భగవంతుడికే ఎరుక. అదృష్టం ఎప్పుడో ఒకప్పుడు తలుపు తట్టుకువస్తుందంటారు. మా ప్రయత్నాలు ఫలించని దశలో పెళ్ళికొడుకే వెతుక్కుంటూ వచ్చాడంటే అందులో కొంత అతిశయోక్తిఉన్నా అది పాక్షికంగా నిజం. ఎవరి పెళ్లిలోనో ఆ అబ్బాయి మా జ్యోతిర్మయిని చూసాడట. ఈ పిల్లే నాకు కావాలని తల్లిదండ్రులతో చెప్పాడట. వాళ్లే మధ్యవర్తులద్వారా సంప్రతింపులకొచ్చారు. కట్నం దగ్గర మాత్రం తుస్‌మనబోయింది. వాళ్లుకోరిది మేంఇచ్చుకునే స్థితిలోలేం. జ్యోతిర్మయి ఇంతకాలంగా అంతపెద్దగా కట్నాలుఅడిగిన వారి సంబంధాలను తిప్పికొట్టేది. ఈ అబ్బాయి విషయానికొచ్చేసరికి అది దిగాలుపడింది, నిరాశ చెందింది.

"వాళ్ళది సంప్రదాయమైన కుటుంబం. అమ్మాయికి అబ్బాయి నచ్చాడు. వాళ్లేం గొంతెమ్మ కోర్కెలు కోరటంలేదు. లక్షరూపాయలు ఈ రోజుల్లో పెద్దమొత్తం కాదు. తలతాకట్టు పెట్టి అయినా ఈ పెళ్ళి జరిపిస్తే అమ్మాయి సుఖపడుతుంది" నా మిత్రుడు సలహా యిచ్చాడు.

'అలా చెప్పండి' వంత పాడింది నాభార్య.

సలహాలకేం నోటికి మాత్రమేపని. కనీసం ఒకటిన్నర లక్షలుంటేనే కాని పెళ్లి జరగదు. అంత డబ్బు నా దగ్గరలేదు. కన్నతండ్రిగా పెళ్లిచేయవలసిన బాధ్యత నాది. ఎవరి వరకో ఎందుకు, ఆ సంబంధం నాకూ నచ్చింది. పిల్ల పెళ్లి చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయాను.

★ ★ ★

పెళ్లి అయిన సంవత్సరం ఆషాఢమాసంలో జ్యోతిర్మయి పుట్టింటికి వచ్చింది.

"నాన్నా! సావిత్రికేం తక్కువైంది. ఆమెకింకా పెళ్లికాలేదు?" యథాలాపంగా అడిగింది జ్యోతిర్మయి.

సావిత్రి గురించి నాకు తెలుసుగాని వారి కుటుంబంతో బొత్తిగా నాకు పరిచయంలేదు. సావిత్రి పెళ్లికి తొందరపడటం లేదేమో? మంచి ఉద్యోగం చేస్తున్నది. ఇంకా పైకి వెళ్లే అవకాశా లున్నాయి. ఈకాలం పిల్లలు స్వతంత్రంగా బ్రతకాలని కోరుకుంటున్నారు. ఒక పురుషుడికి ఊడిగం ఎందుకు చెయ్యాలి అని ఈతరం పిల్లలు భావిస్తున్నారు. తన ఆర్థికస్వేచ్ఛను తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలని సావిత్రి భావిస్తున్నదేమో?

ఇంకా ఇతర కారణాలు ఏవైనా ఉండవచ్చు. ఆమె విద్యావంతురాలు, వివేకవంతురాలు, అర్జనపరురాలు. కయ్యానికైనా, వియ్యానికైనా సరిసమానులు కావాలి. ఆమె దృష్టిలో ఎలాంటి పెళ్లి కొడుకున్నాడో? ఇంతవరకు అలాంటివాడు తారసపడలేదేమో?

రంగారావుగారికి మాత్రం చింత వుందో లేదో తెలియదు. కాని మా జ్యోతి మాత్రం తెగ బెంగపడుతున్నది.

"ఈ కాలం పిల్లలు పెళ్ళి అనే జంజాటంలో పడి ఆర్థిక స్వేచ్ఛకు తిలోదకాలు ఇవ్వాలని అనుకోవటంలేదు. ఆమెకు వివాహం కన్నా కేరియరే ముఖ్యమై ఉంటుంది" అన్నాను.

"నాన్నా! ఆడవాళ్ళ మనస్తత్త్వం మీకు అర్థం కాదు. నా భర్త, నా ఇల్లు, నా పిల్లలు అనే కోరిక ప్రతీ ఆడపిల్లకూ ఉంటుంది. పైకి డాంబికాలకు పోకపోయినా ఆడపిల్ల ఎంత తొందరగా పెళ్లి అవుతుందా అని ఎదురు చూస్తూంటుంది. సావిత్రికి ఎలాంటి సమస్యలు లేవు. ఆమె సంపా దిస్తున్నది. అవతలివారు కోరిన కట్నం సావిత్రి తనే స్వయంగా భరించగలదు. మరి పెళ్లి ఎందుకు కావటంలేదో నాకు అనూహ్యంగా ఉంది" అంది జ్యోతిర్మయి.

జ్యోతి కొన్నాళ్లుండి వెళ్లిపోయింది. కాని ఆమె నా మెదడులో సమాధానం దొరకని ప్రశ్నను మిగిల్చిపోయింది. కందకులేని దురద కత్తిపీటకా అంటారు. సావిత్రి వివాహం గురించి నేను తెగ ఆలోచించేవాడిని. ఎంతకాలం నాలో నేను తర్జనభర్జనలు చేసుకోవాలి?

"అయ్యో! ఇది మరీచోద్యంగా ఉందండి. జ్యోతికి ఆ పిల్ల స్నేహితురాలు కాబట్టి మాటవరుసకు అడిగింది. దాంతో మీరు హైరానా పడాలా? అంతగా ఆలోచించేకన్నా ఓ మారు రంగారావుగారింటికి వెళ్లండి. మీ బుర్రను దొలుస్తున్న ప్రశ్నకు సమాధానం అక్కడ దొరుకవచ్చు" అంది నా భార్య.

అతడితో పరిచయంలేని మాట యదార్థమే కాని అతడ్ని కలవాలనుకున్నాను.

"ప్రభాకరరావుగారా?ఔను మా సావిత్రి మీ గురించి మీ అమ్మాయి జ్యోతిర్మయి గురించి చెప్తూ ఉంటుంది. ఎప్పుడూ లేనిది ఇలా వచ్చారే?" ఆప్యాయంగా పలకరించాడు.

కొంతసేపు ఆ విషయం ఈ విషయం మాట్లాడి తనని గురించి, సావిత్రి గురించి కొంత విషయం రాబట్టేను. ఆ దగ్గరలోనే ఉంటున్న నా స్నేహితుడు గోపాలకృష్ణ మరికొన్ని విషయాలు చెప్పాడు.

రంగారావు భార్య చచ్చిపోయి చాలా కాలమైంది. సావిత్రి అతని పెద్దకూతురు. మరొక ఇద్దరు మగపిల్లలున్నారు. పెద్దవాడు ఇంటర్ చదువుతున్నాడు. రెండోవాడు హైస్కూల్లో ఉన్నాడు. రంగారావు నామమాత్రానికి ఏదో ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. నామమాత్రంగానే జీతం దొరుకుతుంది. అతనికి ఉద్యోగంచేయాలని, కుటుంబాన్ని పోషించాలని ధ్యాస బొత్తిగాలేదు. సావిత్రి ఉద్యోగంలో చేరకముందు వారు కటిక దారిద్ర్యం అనుభవించారట. "వాళ్ళిచ్చే బోడి జీతానికి ఎవరు ఇంతకన్నా పని ఎక్కువ చేస్తారు? పోతే పోతుంది బోడి ఉద్యోగం" అనేవాడట. సావిత్రి నానా తంటాలుపడి వేరేచోట వేయించేదట. ఇలా అతను ఏ ఉద్యోగంలోనూ స్థిరంగా ఉండటంలేదు. సావిత్రి ఇంటరు కాగానే బి.ఎస్.సి.లో చేరతానందట. "ఈ చదివింది చాలు ఎక్కడో పనిచేసి నాలుగురాళ్ళు సంపాదించు. మగపిల్లల్నే చదివించనా, నిన్ను చదివించనా?" అన్నాడట. అయితే సావిత్రి మొండిది. "మీరు నాకు ఫీజులు కట్టనక్కరలేదు. పుస్తకాలు కొననక్కరలేదు." అంటూ కాలేజీలో చేరిందట. అయితే మగపిల్లల్ని చదివించడానికి నానా తంటాలు పడేవాడట. సావిత్రి అనుకున్నది సాధించింది. వెంటనే బ్యాంకు ప్రొబేషన్ ఆఫీసర్ పరీక్షరాసి, సెలక్టు అయింది. అప్పటి నుండి సావిత్రే ఆ ఇంటికి పెద్దదిక్కు అయింది. రంగారావు చేస్తున్న ఉద్యోగం మానేసి కాలుమీద కాలు వేసుకుని కూర్చొని అజమాయిషీ చేస్తున్నాడు.

"మా సావిత్రిలాంటి కూతుర్లు అందరికీ ఉండరండీ! నాన్నా! మీ ఆరోగ్యం అంతంతమాత్రం. ఉద్యోగం ఏం చేస్తారు? మందుమాకూ తింటూ ఇంటిపట్టునే ఉండండి అని నన్ను పనిలోనికి వెళ్లనివ్వలేదు" అన్నాడు రంగారావు.

అదృష్టవంతుడు అని మనసులో అనుకున్నాను.

"పెళ్ళి చేయటం అంటే ఆషామాషీ వ్యవహారమా? సరియైన సంబంధం దొరకాలిగా! ప్రయత్నలోపాలు లేకుండా అదే పనిలో ఉన్నాను. ఎన్ని జతల చెప్పులు అరిగిపోయాయో? అయినా మన చేతుల్లో ఏముందండీ! ఇంకా కళ్యాణ ఘడియ రాలేదు" నిర్వేదంగా అతనంటే నాకు కాస్త ఉపశమనం కలిగింది. కూతురుపెళ్ళి విషయం తండ్రికి పట్టకుండా వుంటుందా?

"చాలా సంబంధాలు నాకే నచ్చేవి కావు. ఒకటి రెండు సంబంధాలు ఫరవాలేదు అని నేననుకుంటే సరిపోతుందా? సావిత్రి పెదవి విరిచేది. బి.ఎస్.సి. చదివింది. పెద్ద ఉద్యోగం. దానిహోదాకు తగినవాడు దొరకాలిగా!" అన్నాడు చిద్విలాసంగా.

"సావిత్రి మొగుడు ఎక్కడో ఉండే వుంటాడు. మీరన్నట్లు ఆ ఘడియ రాగానే బయటపడతాడు" అన్నాను.

"గాలిలో దీపం వుంచి దేవుడా నీదే భారం అంటే దీపం ఆరిపోకుండా ఉంటుందా? నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను." అన్నాడు.

★ ★ ★

మా ఊరు నుండి స్నేహితులు వస్తే సాయంత్రం వరకు వాళ్లతో గడిపి వాళ్ళను బస్ ఎక్కించి ఇంటికి వెళ్ళడానికి సిటీబస్‌స్టాప్‌లో నిల్చున్నాను. అప్పుడు సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నది. పరధ్యానంగా ఉన్న నేను సావిత్రి ఎప్పుడు వచ్చి నా ప్రక్కన నిల్చుందో నేను చూడలేదు.

"నమస్కారం బాబాయిగారు! మీరు ఇక్కడ...!?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది. ఆమె బాగా అలసిపోయి ఉంది.

"నువ్వా సావిత్రి?!" అంతే ఆశ్చర్యంగా పలకరించేను.

ఆమె పనిచేసే బ్యాంక్ అక్కడకు దగ్గరలోనే ఉందట. రోజూ ఇక్కడే బస్సు ఎక్కుతుంది. కొంతదూరం పోయిన తరువాత మరో బస్సుకి మారుతుందట. అది దిగి కొంతదూరం నడిచి ఇంటికి వెళ్తుందట. ఇంటికి చేరేసరికి ఏడు దాటిపోతుందట. డబ్బు గడిస్తున్నా సుఖంలేదు.

"సావిత్రి! ఒక మోపెడ్ కొనుక్కోరాదా? మీకు లోన్ దొరికే సౌకర్యం ఉందిగా! ఇంత శ్రమ ఉండదు" అన్నాను. బస్సులలోనూ, నడిచి వెళ్ళటం ఎంత కష్టమో నాకు తెలుసు.

సావిత్రి విషాదంగా నవ్వింది. "ఆ ముచ్చటా అయ్యింది. మా తమ్ముడు కాలేజికి వెళ్లి రావడానికి కష్టపడిపోతున్నాడట. ఆడపిల్లవు ఆ రద్దీలో నువ్వు స్కూటరేం నడుపుతావు? ఆ బండి తమ్ముడికిచ్చేయరాదూ? అని మా నాన్నగారు ప్రతిపాదించేరు" అంది నవ్వుతూ.

"ఇంకొకటి కొనుక్కోగలను. కానీ నాకు మరో తమ్ముడున్నాడు. ఎవరికెంత ప్రాప్తమో – అంతే!" అంది.

సొమ్మొకడిది సోకొకడిది. ఆ ప్రశ్న వేసి సావిత్రిని బాధపెట్టానేమో అని అనుకున్నాను.

"బాబాయిగారు! వెతకబోయిన తీగ కాలికి తగిలిందట. ఈరోజు మిమ్మల్ని తప్పనిసరిగా కలవాలను కున్నాను. ఇంటికి వెళ్లిన తరువాత బయలుదేరితే నాన్న యక్షప్రశ్నలు వేస్తాడు" అంది.

"నాతో పని ఉందా?అలా పద. ఎదురుగా కాఫీ హోటలుకెళ్దాం. కాఫీ త్రాగుతూ మాట్లాడు కోవచ్చు" అన్నాను. ఏం పనో? రోడ్డుమీద నిలబెట్టి మాట్లాడం ఆమెకు ఇబ్బంది.

"లేదు. నా బస్సు వచ్చే వేళైంది. ఇది తప్పిపోతే మరో ముప్పావుగంటవరకు బస్సురాదు. పెద్దగా పనేమీలేదు. రేపు నన్ను చూసుకునేందుకు మగపెళ్లివారు వస్తున్నారు. మధ్యాహ్నం రెండుమూడు గంటలమధ్య, బాబాయిగారు! మీరు రాగలరా?"

"నేనా?" అన్నాను.

"ఔను, మీరే" అంది.

"మీరు వస్తే నాకు ధైర్యంగా ఉంటుంది."

పిలవని పేరంటానికి వెళ్తే రంగారావు ఏమనుకుంటాడో. ఇలాంటి సమయంలో నా అవసరం ఏముంటుంది? తల్లిలేని పిల్ల కాబట్టి అలాంటి సమయంలో ఆడసహాయం అవసరం కావచ్చు. నేను ఎటూ నిర్ణయించుకోలేకపోయాను. ఇంతలో ఆమె బస్సు వచ్చి ఆగింది.

"వస్తారు కదూ? తప్పక రావాలి" బస్సెక్కుతూ అంది. మరో సమయంలో అయితే ఆమె కళ్లు వర్షించి ఉండేవి.

"తప్పక వస్తాను" అన్నాను.

★ ★ ★

ఆ రాత్రే సావిత్రిని కలిసిన విషయం నా భార్యకు చెప్పాను.

"తప్పకుండా వెళ్దాం" అంది ఆమె.

★ ★ ★

ఒంటిగంట దాటగానే నేనూ నాభార్య రంగారావు ఇంటికి వెళ్ళాం. రంగారావు వసారాలోనే కన్పించాడు. అనుకోకుండా మేం వెళ్లినందుకు కాస్త గాబరాపడ్డాడు. తెచ్చికోలు నవ్వుతో మమ్మల్ని పలకరించాడు.

"ఈ రోజు మా అమ్మాయిని చూసుకుంది మగపెళ్లివారు వస్తున్నారు" అన్నాడు. అప్పటికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లున్నాయి. సావిత్రి రమ్మంది. అందుకే వచ్చాం అని అనబోయాను. నా భార్య వారించింది. అందువలన "అలాగా!" అని మాత్రం అని అన్నాను.

"మీరే పనిమీద వచ్చారో నాకు తెలియదు. ఇప్పుడు నాకు ఊపిరి పీల్చుకోవడానికి కూడా సమయం లేదు. దయచేసి మరోరోజు రండి. ఇలా అంటున్నందుకు మీరేం బాధపడకండి" అన్నాడు.

రమ్మనమని ఒకరు మమ్మల్ని ఆహ్వానించారు. వేరొకరు వెళ్లిపొమ్మని ప్రాధేయపడుతున్నారు. నా గొంతుకలో పచ్చివెలగకాయ పడినట్లైంది. అంతలో సావిత్రి అక్కడ ప్రత్యక్షమైంది. "నాన్నా! బాబాయిగార్ని, పిన్నినీ నేనే రమ్మన్నాను. మీకు తోడుగా ఉంటారు" అంది.

రంగారావు బిగ్గరగా నవ్వాడు. "ఇలాంటి పెళ్లి చూపులంటే నాకు కొత్తా? ఇప్పటికి ఎంతమంది వచ్చారు - వెళ్లారు. ఇలాంటి సమయంలో నాకు తోడు అవసరమంటావా? పాపం ప్రభాకరరావుగారికి శ్రమ కల్పించావు" అన్నాడు.

సావిత్రి నాభార్యను తీసుకుని లోనికి వెళ్లింది.

"ప్రభాకరరావుగారు! మీకే పనులున్నాయో, అనవసరంగా మా సావిత్రి మిమ్మల్ని రమ్మంది. మీరు వెళ్లి మీ పనులు చూసుకోండి."

సావిత్రి ఏమి ఆశించి మమ్మల్ని రమ్మంది? ఇతను ఏమి ఆశించి మమ్మల్ని పొమ్మంటున్నాడు?

సావిత్రి రెండు కప్పులు కాఫీ తెచ్చి మాకిచ్చింది. రంగారావు విధిలేక నన్ను కూర్చోమన్నాడు.

"ఇప్పటికీ పదిహేను సంబంధాలు చూసాము. ఈ పెళ్లిచూపులంటే నాకు ఏవగింపు కలుగుతుంది" అన్నాడు.

"మరే, ఆడపిల్ల పెళ్ళి అంటే ఆషామాషీకాదు. మీ అంతటి చేదు అనుభవం లేకపోయినా నేనూ ఈ పాట్లన్నీ పడ్డాను. పిల్లనిస్తున్నాం కాబట్టి ఎన్నో విషయాలు ఆలోచించాలి. అన్నీ బాగున్నాయి అని అనుకుంటే కట్నం దగ్గర పొంతన కుదరదు. అయినా మీ కలాంటి ఇబ్బందిలేదు. ఎంతైనా కట్నం ఇవ్వగల స్తోమత మీకుంది. అయితే యోగ్యుడైన వరుడు దొరకాలి" అన్నాను.

"దూరపు కొండలు నునుపు అంటారు. నేనూ మీలాంటి మధ్య తరగతివాడినే. మా అమ్మాయి సంపాదనను దృష్టిలో ఉంచుకుని మీరలా అంటున్నారు. ఎంత చెట్టుకి అంతగాలి. మాకూ మా సమస్యలున్నాయి" అన్నాడు.

ఆడపిల్ల పెళ్లి తలపెట్టినప్పుడు మనం ఏదో ఒకవిధంగా రాజీపడాలి. మీ అమ్మాయిలో ఏ లోపంలేదు. మరి ఇంతవరకు మీ ప్రయత్నాలు ఎందుకు ఫలించలేదో అర్థంకావటంలేదు. నిజమే, మీ అబ్బాయిల చదువులింకా ఒక కొలిక్కి రాలేదు. అయినా పిల్లవాడు నచ్చితే కట్నందగ్గర భీష్మించుకుని కూర్చోకండి" అన్నాను.

"ఎవరికి ఎక్కడ రాసిపెట్టి ఉందో?...." వేదాంతిలా మాట్లాడేదు రంగారావు. పెద్దగా కట్నం ఇవ్వడానికి అతడు సుముఖంగా లేడా?

"అన్నయ్యగారూ! మీ అమ్మాయిని ఒకసారి చూడండి" హాలులోనికి వచ్చి అంది నాభార్య.

"గంగిరెద్దులా అలంకరించారే. ఈకాలం కుర్రాళ్లు సహజసౌందర్యం కోరుకుంటారు. మీరు మరీ బి.సి.కాలంలా అలంకరించారు" అన్నాడు.

నా భార్య చిన్నబుచ్చుకుంది. "అయ్యో! మీకు నచ్చలేదా? పెళ్ళిచూపులకని పట్టుచీర కట్టాను. మెడ మరీ బోసిగా ఉండకూడదని నెక్లస్ వేయమంది సావిత్రి. రెండు జతల గాజులు పాపిటబిందెలు. రోజూ ఆఫీసుకు వెళ్తూ ఈ అలంకరణ చేసుకోదుగా? పోనీలెండి. మీరు కోరినట్లు సాదా చీర కడతాను. ఈ తొడుగులు తీసేస్తాను. ఎలా అలంకరించినా మా సావిత్రి అందంగానే ఉంటుంది. పిల్లను చూసివారు కట్నం వూసెత్తరు" అంది నాభార్య.

"వద్దులెండి. మీకు శ్రమ. వాళ్లు వచ్చే వేళకూడా ఔతున్నది" అన్నాడు.

"మగపెళ్ళివారు ఈ రోజుల్లో మరీ బరితెగించుకుపోతున్నారు. కట్నం ఇవ్వటం పుచ్చుకోవటం రెండూ నేరమే అంటుంది చట్టం. అయితేనేం మగపెళ్లివారు తెగేసి కట్నం అడుగుతారు. వాళ్ళబ్బాయి చదువుకైన ఖర్చంతా ఆడపిల్లగలవాళ్ళ నుండి రాబట్టాలనుకుంటారు. మరి ఆడపిల్ల చదువుకైన ఖర్చు గురించి ఆలోచించరేం? నన్నడిగితే మేమసలు కట్నం ఎందుకివ్వాలి? మా అమ్మాయి ఆ అబ్బాయంతా చదివింది, ఉద్యోగం చేస్తున్నది."

రంగారావన్నది యథార్థమే. సావిత్రి సంవత్సరానికి లక్ష రూపాయల దాకా ఆర్జిస్తున్నది. అయితే వ్యవస్థలో మార్పు వచ్చేవరకు ఈ తిప్పలు తప్పవు.

"ఇప్పుడు మీరు ఆడపిల్ల తండ్రిగా ఇలా అంటున్నారు. రేపు మీ కొడుకుల పెళ్లి సమయంలో ఈ మాట మీద నిలబడలేరు. నలుగురూ నడిచే బాటలో నేనూ నడవాలనుకోవటం తప్పా అంటారు. ఆ రోజుల్లో అమ్మాయి పెళ్ళికే ఇన్ని లక్షలిచ్చాం అంటారు" నవ్వుతూ అన్నాను.

రంగారావు నా అభిప్రాయం తప్పని అంటాడనుకున్నాను. అబ్బే నాకొడుకుల పెళ్ళిళ్లు ఆదర్శప్రాయంగా చేస్తాను. కానీ కట్నం అడగను అని అంటాడేమో అనుకున్నాను. అతడు లౌక్యుడు. అందరిలాంటివాడే. కప్పదాటు వేసాడు.

★ ★ ★

పెళ్ళిచూపులు సక్రమంగా జరిగిపోయాయి. వచ్చినవాళ్లు మర్యాదస్తుల్లా ఉన్నారు. పెళ్ళికూతుర్ని శల్యపరీక్షలు చేయలేదు. పెద్దగా ప్రశ్నలు వేయలేదు.

"మాకు మీ పిల్ల నచ్చింది. మీకు మా అబ్బాయి నచ్చితే ఇతర విషయాలు ఇప్పుడే మాట్లాడు కుందాం. ఇంటికెళ్లి ఆలోచించి రెండుమూడు రోజుల్లో తెలియజేస్తాం అని చెప్పి మిమ్మల్ని టెన్షన్‌లో పెట్టడం మా అభిమతం కాదు" అన్నాడు పెళ్ళిపెద్ద.

నాకు చాలా సంతోషం వేసింది.

"మా అబ్బాయి పెళ్లి అయిపోతే మా బాధ్యత తీరిపోతుంది. ఉద్యోగరీత్యా వేరేచోట ఉంటు న్నాడు. అందుకే మేం తొందరపడుతున్నాం" అంది పెళ్ళికొడుకు తల్లి.

"ఆ ఇతర విషయాలు అంటే కట్నం గురించే కదా?" అడిగాడు రంగారావు. రంగారావుది కుండబద్దలు కొట్టేలా అనే స్వభావం. ఇలాంటి సమయంలో సంయమనం పాటించాలి. లేకుంటే వికటించే ప్రమాదం ఉంది.

"అయ్యో! ఇతర విషయాలు అంటే మీరు పొరపాటుగా అర్థం చేసుకున్నారు. నేను ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్లు చేసాను."

"అర్థమైంది. ఆ పిల్లల పెళ్లిళ్లకు మీరు ఇచ్చిన కట్నం మొత్తం మీ అబ్బాయి పెళ్లిలో కట్నరూపంగా పొందాలని చూస్తున్నారా? కొందరు పిల్లాడి చదువుకైన ఖర్చు అంటారు. మరికొందరు మీ పిల్లను జీవితాంతం పోషించాలి కదా అంటారు. ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోవటానికి. చెప్పండి, కట్నం ఎంతకావాలి?"

రంగారావు చాలా దురుసుగానే మాట్లాడాడు. నాలాంటి వాడైతే అంత కరుకుదనాన్ని భరించలేక, తక్షణం తిరిగి వెళ్ళిపోయి ఉండేవాడు.

"రంగారావుగారు! మీరు నన్ను పూర్తిగా చెప్పనివ్వటంలేదు. మేం మీదగ్గర నుండి ఎలాంటి కట్నం ఆశించటంలేదు. మా కోడలే మాకు కట్నం. కట్నం మేం తీసుకోం. కాని కానుకల విషయంలో రాజీపడటం నాకు సాధ్యం కాదు" అన్నాడు పెళ్లిపెద్ద.

రంగారావుకి ఎంతో అనుభవం ఉంది. అందుకే అతను కట్నం అనగానే చిరాకుపడుతున్నాడు. వీళ్లు ఏదో మెలికపెడుతున్నారు. కట్నం అసలొద్దు అంటూనే కానుకల విషయంలో రాజీ పడబోమంటున్నారు.

"చెప్పండి, మీరేం ఆశిస్తున్నారో? చల్లకొచ్చి ముంత దాస్తున్నారా?" వ్యంగ్యంగా అన్నాడు రంగారావు.

మగపెళ్లివారి విషయం వదిలేసినా నేను ఆ పుల్లవిరుపు మాటలకు బాధపడ్డాను. వాళ్లు గతిలేక ఇతని ఇంటికొచ్చారా? మన పెద్దలేర్పరచిన సాంప్రదాయం – ఈ పెళ్లిచూపులు. వాళ్లేదో ఎత్తుకుపోవడానికి వచ్చినట్లు మాట్లాడం మంచిదా? అతను తలపెట్టింది. ఆడపిల్లపెళ్లి.

"నాకు ఇద్దరు ఆడపిల్లలున్నారని మీకు తెలుసు. తమ్ముడి పెళ్లిలో వారికి రావలసింది వారు వదులుకోరు..."

"బాగుంది. ఈ డొంకతిరుగుడు వ్యవహారం బాగుంది. వెనుకటికెవరో అమ్మడానికని అవును, పిల్లిని సంతకు తెచ్చాడట. ఆవు ఖరీదు రూపాయి, పిల్లి ఖరీదు రెండువేలు అని బేరం పెట్టడట. అయితే వాటిని విడివిడిగా అమ్మడట. ఎవరైనా రెండింటినీ కొనవలసినదేనట. మీకు కట్నరూపేణా ఏమీ అక్కరలేదు, కానీ లాంఛనాలుగా ఆ ఇద్దరు ఆడపిల్లలకి చెరొక లక్షా కావాలి. అంతేగా? మరి అత్తగారి లాంఛనం మాటేవిటి?"

రంగారావన్నది నిజమే. కొందరు ఈవిధంగా కూడా అడుగుతారు. అయినప్పటికీ రంగారావు నోరుపారేసుకోకుండా వారు చెప్పింది మౌనంగా వింటే బాగుండేది.

"రంగారావుగారూ! మీరు ఉండండి. వారు ఏం చెప్పదలుచుకున్నారో చెప్పనివ్వండి. కట్నం అక్కరలేదు అన్నవాళ్ళు ఆడబడుచు లాంఛనాలు అంత పెద్దమొత్తం అడుగుతారా?" అన్నాను.

"బాగా చెప్పారు మేం లక్షలూ, కోట్లూ కోరడంలేదు. ఇద్దరాడపిల్లలకు చెరో అయిదువేలు ఇస్తేచాలు. అత్తగారి లాంఛనం మీరిస్తే సంతోషంగా తీసుకుంటాం లేదంటే బలవంతం లేదు" అన్నాడు.

ఈనాడు ఇంత ఉదారస్వభావులూ, ఆదర్శవంతులూ ఉన్నారంటే నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. రంగారావు ఇంకా ఎందుకు ఆలోచిస్తున్నాడు?

"రంగారావుగారు! మీరేదో ఆలోచిస్తున్నారు. ఆ పదివేలూ ఇవ్వడానికి మీ ఆదర్శాలు అడ్డువస్తున్నాయంటే చెప్పండి. మాకవీ వద్దు మీ పిల్లచాలు" అన్నాడు పెళ్లిపెద్ద.

"నాన్నగారు!" అంది ఆ పెళ్లి పెద్దకూతురు.

"నువ్వుండమ్మా! వారు ఆ డబ్బు ఇవ్వడానికి తటపటాయిస్తున్నారు. నీవు కోరిన ఆ డబ్బు నేనిస్తాను" అన్నాడతను.

"రంగారావుగారు ఇంకా సందేహం దేనికి? వారు కోరుతున్నది ఆడబడుచు లాంఛనాలుగా పదివేలేగా! ఊ అనండి" అన్నాను.

రంగారావు మదిలో ఏముందో?

"ఉన్నపాటున ఎలా చెప్పగలను? ఆలోచించుకోవడానికి నాకు రెండుమూడు రోజుల గడువు కావాలి. నేనే మీ యింటికి స్వయంగా వస్తాను" అన్నాడు. నాకు రంగారావు మీద చెప్పలేని కోపం వచ్చింది. ఆడపిల్ల తండ్రి ఐనా పెళ్లికొడుకు తండ్రిలా బింకంగా కూర్చున్నాడు. సావిత్రి పెళ్లి చేయాలని అతను అనుకోవటంలేదా? ఇంతలో నా భార్య సంజ్ఞ చేసి నన్ను రమ్మంది. "రంగారావుగారు! మీ అమ్మాయి ఇష్టపడుతున్నది. ఇప్పుడే ఖాయంచెయ్యమంటున్నది" అన్నాను రంగారావు చెవిలో రహస్యంగా.

అయినా రంగారావు చలించలేదు. "రెండురోజుల తరువాత మిమ్మల్ని కలుస్తాను" అన్నాడు పెళ్లిపెద్దతో. మీ పని అయిపోయింది. ఇక మీరు వెళ్లవచ్చు అన్నధోరణిలో. పెళ్లిపెద్ద బాధపడ్డాడు.

"మీకు మా సంబంధం ఇష్టం లేనట్లుంది" అంటూ లేచాడు. సావిత్రిని సముదాయించటం నా భార్యకు సాధ్యం కాలేదు.

★ ★ ★

"కాకిముక్కుకు దొండపండా? ఆ అబ్బాయి మా పిల్లముందు దిష్టిబొమ్మలా ఉంటాడు. కట్నం అక్కరలేదట. ఇందులో ఏదో మోసం ఉన్నట్లుంది. నేను బుద్ధిహీనుడనా? ఆ కుర్రాడి గత చరిత్ర మంచిదికాదేమో?"

రంగారావు తత్వం నాకు అర్థం కాలేదు. నా పిల్ల ఉద్యోగస్తురాలు. కానీ కట్నం ఇవ్వను అంటూనే వేరొకవంక కట్నం కోరని వారిది మోసం అంటున్నాడు. అసలు రంగారావుకి పిల్ల పెళ్లిచేయటం ఇష్టంలేదా? మరి అలాంటప్పుడు ఈ పెళ్లిచూపుల ఏర్పాట్లు ఎందుకు?

మేం వచ్చిన పని అయిపోయింది. సావిత్రి ఎందుకు రమ్మందో నేను గ్రహించాను. కానీ నేనామెకు ఎలాంటి సహాయమూ చేయలేకపోయాను. బాధతో ఇంటికి తిరిగి వచ్చాము.

★ ★ ★

ఏ సంఘటన అయినా కొన్నిదినాలు మనసుని కలచివేస్తుంది. ఆ తరువాత ఆ సంఘటన ఎప్పుడో కాని గుర్తురాదు.

ఉన్నట్టుండి రంగారావు మా ఇంటికి వచ్చాడు. రెండురోజుల ముందే సావిత్రి లేచిపోయిన విషయం జ్యోతిర్మయి ద్వారా తెలిసింది. అతన్ని ఎలా సముదాయించాలో తెలియక తికమక పడుతున్నాను. అపద్బాంధవిలా నా భార్య అడ్డువచ్చింది.

"రండి, అన్నయ్యగారు! సావిత్రికి ఆ సంబంధం నిశ్చయం చేశారా? ఆ శుభవార్తే చెప్పడానికే వచ్చారా?" అంది.

"చూశారా! అది ఎంత పాడుపనిచేసిందో? మా వంశం పేరు మంటగలిపింది. నీచురాలు. మమ్మల్ని రోడ్డుమీద పడేసి ఎవరితోనే లేచిపోయింది."

సావిత్రి అంతపని చేసిందా?" అన్నాను.

"ఔను! చూసే వాళ్లకు అలాగే కనిపిస్తుంది. అనుభవించేవాళ్లం మాకు తెలుసు. అపురూపంగా పెంచాను, తల్లి లేకపోయినా" అన్నాడు రంగారావు.

"ఉద్యోగం ఉందిగా! ఎక్కడకు పోతుంది?" అంది నా భార్య.

"మా ఇద్దరి పేరునా జాయింట్ ఎకౌంట్‌లో ఉన్న రెండులక్షలూ తీసుకుంది. ఇంత ద్రోహం చేసినదానికి పుట్టగతులుండవు. దీన్ని లేపుకపోయినవాడు ఆ డబ్బు కాజేసి, శీలాన్ని దోచుకొని నడి రోడ్డుమీద వదిలేస్తాడు. అప్పుడది నాన్నా నేను తప్పుచేశాను అని ఏడుస్తూ ఇంటికివస్తే నరికిముక్కలు చేస్తాను" అన్నాడు రంగారావు కోపంతో. కడుపున పుట్టిన బిడ్డ ద్రోహం చేస్తే కన్నవారు బాధపడతారు. అలాంటి పిల్లల్ని ఛీత్కరిస్తారు. సావిత్రి ఇలా ఎందుకు చేసింది? తండ్రీ తమ్ముళ్ల గురించి కొంచెమైనా ఆలోచించలేదా?

★ ★ ★

"సావిత్రి పెద్దతమ్ముడిని లక్షన్నర డొనేషన్ కట్టి కర్ణాటకలో కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో చేర్పించాలనుకున్నాడు రంగారావు. టెలీకమ్యూనేషన్స్ ఇంజనీరింగ్‌లో ఎంట్రన్స్ పరీక్షకు చిన్న కొడుక్కి ఇప్పటినుండే కోచింగ్ ఇప్పించాలనుకున్నాడు. సావిత్రి సంపాదన తప్పిస్తే చిల్లిగవ్వ లేదు. సావిత్రి పెళ్లి చేసుకొని వెళ్లిపోతే రంగారావు మగపిల్లల్ని చదివించలేడు. అందుకే ప్రతీసంబంధాన్ని ఏదో సాకుతో తప్పిస్తున్నాడు. సావిత్రికి అతని పన్నాగం తెలిసిరాలేదు. పైగా ఆమెను మభ్యపెట్టటానికి ఈ పెళ్లిచూపుల నాటకాలు" అంది నా భార్య.

"కొడుకుల అభివృద్ధి కోరుకోవటం తండ్రిగా అతని బాధ్యత. ఐతే అందుకు కూతుర్నే పావుగా వాడుకోవాలనుకున్నాడా?" అన్నాను.

"ఆ రోజు సావిత్రి లేచిపోయిందని మీరంటే మంచిపనే చేసింది అన్నాను. తండ్రి ఎత్తులు గ్రహించిన సావిత్రికి మరో మార్గంలేదు. ఆ పిల్లాడు నచ్చాడని సిగ్గువిడిచి చెప్పినా తండ్రి వినలేదు"అంది.

"ఇన్ని వివరాలు నీకెలా తెలిసాయి. అయినా సావిత్రి చేసింది ద్రోహమే. ద్రోహమేకాదు తన జీవితాన్ని పణంగా పెట్టింది. ఇలాంటి పెళ్లిళ్లు సజావుగా ఉండవు. అరటాకు ముల్లూ సామెత తెలుసుగా!" అన్నాను.

సావిత్రి మూర్ఖురాలు కాదు. ఆమె ముక్కూమోహం ఎరగని వాడితో లేచిపోలేదు. ఆరోజు పెళ్లిచూపులకొచ్చిన అబ్బాయినే వారి తల్లిదండ్రులముందు అగ్నిసాక్షిగా వివాహమాడింది. ఆ పెళ్లికి ఆమె పనిచేసే బ్యాంకు ఉద్యోగులూ వెళ్లారు."

"ఆ సంగతి నీకెవరు చెప్పారు?"

"మొన్న భార్యాభర్తలు మనింటికి వచ్చారు. సావిత్రిని ఈ ఊరునుండి, ఆమె కోరిక మేరకు బదిలీ చేసారు. మిమ్మల్ని చూడలేక పోయినందుకు తెగ బాధపడిపోయింది. నా తండ్రి అన్నా, తమ్ముళ్లు అన్నా నాకూ ప్రేమాభిమానాలున్నాయి. అయితే వారికి కావలసింది నా సుఖం కాదు, నా డబ్బు. తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డబేరం లేదంటారు. అవివాహితగా మనడం ఈ సంఘంలో అంత తేలిక కాదు. అందుకే తెగించాను" అంది.

**(జాగృతి 9,ఆగస్టు 2004)**